
రాత్రంతా రైల్లో నిద్రలేదు. 'లేదు' కాదు, పోలేదు. పోలేకపోవడానికి కారణం నిద్రరాలేదు. సదుపాయమయిన బెర్త్ దొరికింది. చక్కగా టిఫిన్ తిని, దానిమ్మగింజల ఫలహారం చేసాను. పడుకున్నాను. అయినా నిద్ర పట్టలేదు. ఉత్కంఠ, ఆమెతో ఎలా మాట్లాడాలి? ఎలా ఎదురుపడాలి? అసలు ఎలా ఉంటారు?

ఫోటోల్లో తప్ప విడిగా ఎప్పుడూ చూడలేదు, మరి!

ఈ ఉత్కంఠతో ఎప్పటికోగాని చిన్న కునుకు కూడా రాలేదు. వచ్చిన కునుకు అంతలోనే పోయింది. ఉదయం ఏడుగంటలకి ఎర్రబడిన కళ్లతో నిద్రలేని మొహంతో దిగాను. అయినా ఎంతో ఉత్సాహంగా ఉంది. అలసట ఏమాత్రమూ లేదు.



'విహాయస' కలం పేరు. ఆ పేరుతోనే వ్యవహారం. ఆమె పేరు సర్వలక్ష్మి అనుకుంటా. ఏదో పుస్తకం ముందు మాటలో చదివిన గుర్తు. రెండు పేర్లూ నాకు ఒకలాగే అనిపిస్తుంటాయి. పెద్దగా తేడా ఏం ఉంది?

ఆమె పేరు కూడా నన్ను ఎంతగా ఉత్తేజపరిచిందంటే ఇప్పుడు నేను విమానాలు నడిపే పైలట్ల ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాను. ఉద్యోగంలో చేరబోయేముందు నా ఇన్స్పిరేషన్ ముందు మోకరిల్లాలని ఈ ఉత్కంఠ భరితమయిన ప్రయాణం.

** ** **

# ఒక రాత్రి గడవాలి

కథ

**వాడ్రేవు వీరలక్ష్మీదేవి**

ఆటో ఆ వీధిలో ప్రవేశించేసరికి చెట్ల మధ్యనుంచి ఉదయపు నీరెండ నేలమీద పడి మెరుస్తోంది. రెండువేపులా ఎరుపు తురాయిలు. ఆకు పచ్చగా. ఇది పూసే ఋతువు కానట్టుంది. అయినా గుర్తుపట్టగలిగేను. మా ట్రైనింగ్ సెంటర్ నిండా ఇవేగా. వరుసగా ఇంటి నెంబర్లు చూస్తూ... రెండూ బై ముప్పయ్యారు, ముప్పయ్యేడు, ఆ... ఇదే ముప్ఫయి ఎనిమిది. బాల్కనీ పిట్టగోడ మీద 'చైత్రరథ' అన్న పేరు. ఆటోని ఆపి దిగాను.

నవంబరు నెల. వర్షాలు వెనకబట్టి చలి అడుగు పెట్టబోతూన్న వాతావరణం. చల్లగాలి వీచింది. ఇది సముద్రపు తేమగాలి కాదు. ఆరోగ్యకరమయిన కొండ గాలి. ఒళ్లు పులకించింది.

గేటు తీసుకుని సూట్‌కేసు పట్టుకుని నాలుగడుగులు వేసాను. రెండువేపులా మొక్కలు, పూలు. రకరకాల చామంతులు. "హేమంతవేగి చామంతి పూసె ఈనాడు" ఇది హేమంత ఋతువా?

గ్రిల్ తలుపు వేసి ఉంది. కాలింగ్ బెల్ కోసం చూస్తుంటే గ్రిల్‌కి క్లిప్ చేసి పెట్టిన కాయితం. దాని వెనక పూలగుత్తి. బెల్ కోసం ఎత్తిన చెయ్యి ఆగిపోయింది. "గగన పథ విహారికి పూల ఎదుర్కోలు ఇవే" అని ఉంది ఆ కాయితం మీద.

నాకేనా? ఎంతమాత్రమూ ఊహకి అందేలేదే ఇలాగ. నెమ్మదిగా కాయితం, దాని వెనకనున్న గోల్డెన్ రాడ్స్‌తో కలిపి కట్టిన చామంతి పూల గుత్తీ చేతుల్లోకి వచ్చేసాయి.

ఈ పూలగుత్తి ఇంట్లోనే కట్టిన బొకే అని తెలుస్తోంది. బయట కనిపించే బొకేల కుండే సాధారణత లేకపోవడంవల్ల. తెలుగు స్వాగతం చూస్తూ... నాకేనా... నాకోసమేనా... ఇంత గొప్పస్వాగతం... అని ఆశ్చర్యచకితనవుతుండగా...

పచ్చటి రెండు చేతులు నా భుజాలను చుట్టాయి, నాఫ్తలిన్ బాల్స్ సువాసనను అలుముతూ.

తలెత్తి చూసి... మేడమ్... మీరు...నమస్తే... అన్నాను తడబడుతూ. కనపడగానే నేనేం చెయ్యాలనుకున్నానో అన్నీ మర్చిపోయాను.

"ప్రయాణం బాగా జరిగిందా! రాత్రి నిద్రపట్టిందా?" అంటూ ఆమె నా చేతిలో పెట్టె అందుకోబోయారు. నేను పెట్టె ఇవ్వలేదు. ఆమెనే చూస్తూ ఉండిపోయాను.

ఆమె ధారుఢ్యం. ముఖ్యంగా దేహ ధారుఢ్యం. అరవై ఏళ్ల స్త్రీలాగ ఎంత మాత్రమూ లేరు. తలలో నెరుపు అక్కడక్కడ కనిపిస్తోంది గానీ షి ఈజ్ వెరీ హెల్దీ. పదేళ్లు తక్కువ లెక్కపెట్టినా చాలదు.

నా చేతిలో పెట్టె లాక్కుని లోపలికి తీసికెళ్లి దివాన్ పక్కన పెట్టి "కాసేపు పడుకుంటావా? కాఫీ తాగేస్తావా?" అని అడుగుతూ ఇంకా నిలబడే ఉన్న నన్ను దివాన్ మీద కూచోబెట్టారు.

అప్పటికి నాకు మాట పెగిలింది.

"వద్దు వద్దు. ఇంక పడుకోను. ఈ రెండు రోజులూ ప్రతినిముషం మీతో గడపాలనే కదా వచ్చింది. కాఫీ నే పెట్టనా" అన్నా.

ఈ వేళకి వద్దు. రేపు పెడుదువుగాని. ఎలా కావాలో చెప్పు చేస్తాను. అంటూ వంట గదిలోకి నన్నూ రానిచ్చారు. పాలు తక్కువ, పంచదార తక్కువతో నా కాఫీ నాకిచ్చి ఆమె నల్లటి డికాషన్ కాఫీలో పంచదార వేసుకొని తనూ తెచ్చుకుని కూచున్నారు. కాఫీల రంగులు పైకి కనిపిస్తూ గాజు కప్పులు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. తూర్పువేపు కిటికీలోంచి చల్లటి గాలి సువాసనతో వీస్తోంది. ఉదయానికీ మిగిలిన జాజిపూల పరిమళం. మెల్ల మెల్లగా లోపలికొస్తోంది. చెప్పలేని ఒక నెమ్మది ఏదో మనసులోకి జారుతోంది. అయినా నా ఆత్రతలు నన్ను వదలవు.

ఈమెకు భర్త, పిల్లలు ఉన్నట్టు తెలుసు. కానీ ఎవరూ కనపడడం లేదు. ఇంట్లో లేరా? నాకు ఒకటే ఆత్రం.

"నీ ఉత్తరం నిన్ననే అందింది. నిన్ననే చూసుకున్నానంటే బావుంటుందేమో! ఇ-మెయిల్‌ని కూడా ఉత్తరం అనే అనాలనిపిస్తుంది నాకు. 'వినీల' అన్న పేరు మగాళ్లు కూడా పెట్టుకుంటారు కదూ? 'వినీల్' అని. అందుకని నువ్వు పేరు చివర 'ల' అన్న ఇంగ్లీషు అక్షరాన్ని శ్రద్ధగా రాయాలి" అన్నారు.

అసలు రహస్యం అదికాదు. నాకు 'వినీలా' అని పిలిపించుకోవడం కంటె 'వినీల్' అన్న మగ పిలుపే ఇష్టం. ఫ్రెండ్స్ అంతా అలాగే పిలు

స్తారు. ఆ మాటే చెప్పా.

"పేర్లకి ఆడామగా ఏముందిలే. గుర్తుకోసం. అంతేకదా!" అని నవ్వేసారు. ఆమె ఏ విషయానికీ ఎదుటి మనిషితో వాదనకి దిగరు అని అర్ధమయింది. కానీ ప్రతిచోటా ఇలాగే ఉంటే లోకువ కట్టెయ్యరూ!

"ఈ బ్లాక్ కాఫీ ఎలా అలవాటయింది మేడమ్ మీకు"

అసలు చాలా రోజులు నాకు కాఫీయే అలవాటు లేదు. శంకర్ ఫ్రెండ్స్ బ్లాక్ టీ, బ్లాక్ కాఫీ అడిగి తాగుతుండేవారు. అంత చేదుగా వేడి పానీయానికి అలవాటు పడడం ఒక గొప్ప విషయంగానూ అదో గొప్ప జీవితానందంగానూ భావిస్తుండేవారు. కొన్నాళ్లకు వాళ్ల ఆ ఆలోచనను బద్దలు కొట్టాలని అనిపించింది. అప్పుడు మొదలుపెట్టాను. ఇప్పటికీ తాగడం మానలేదు నేను, వాళ్లంతా సుగర్లూ, బీపీలూ వచ్చి మానేసారు గానీ. ఇంత చేదు పానీయం తాగడంతో రోజు మొదలుపెడితే ఇక ఆ రోజంతా ఏం జరిగినా మధురమే కదా" అంటూ కొంటెగా నవ్వేరు.

> *గత పదేళ్లుగా మీరు ఏమీ రాయలేదు. ఎక్కడా ఏ సభలోనూ కనిపించడంలేదు. ఇలా వంటింటికి, ఇంటికి, ఇంటి వెనక పూలమొక్కలకి మీ తెలివిని, జ్ఞానాన్ని అప్పగించి ఉండిపోతారనుకోలేదు. మీరు ఇంతకాలం చెప్పిందేమిటి? అది చదివిన నేను, ఆ కొత్తదారి చూపిన ఆలోచనలతో ప్రభావితమయిన నేను, మీరు ఇక్కడ... ఇలా... ఉంటారని ఊహించలేదు.*

వయసు కొంటెతనాన్ని చంపలేదు సరికదా! ఏమాత్రమూ తగ్గించినట్లు కూడా లేదు.

ఇంతకీ శంకర్ ఇంట్లోనే ఉన్నాడా... ఉన్నారా... ఇంకా లేవలేదా? ఆగలేకపోయాను. "సార్ ఉన్నారా మేడమ్ ఎటయినా వెళ్లారా?"

ఉన్నారోయ్! లేవరు. తొమ్మిది దాకా లేవరు. నేను ఉదయపు పక్షిని. లేచి ఓ గంట నడుస్తాను. నల్ల కాఫీతో అలర్ట్ అవుతాను. ఆపైన పూల మొక్కలు, పాదులు నాకోసం ఎదురుచూస్తుంటాయి. పద చూద్దాం అంటూ దారి తీసారు.

వందగజాల పెరడులో చిన్నతోట. పూలు, కూరలు, ఆకుకూరలు, వాటికి పాదులు, నీళ్లు, పరిచర్య అయేసరికి గంటపట్టింది. ఆ గంటా ఆమె పూల రకాల గురించి, సహజ ఎరువుల గురించి, ఆకుకూరల పెంపకంతో ఉండే ఇబ్బందుల గురించి మాట్లాడుతూ ఉన్నారు. నాకు బోర్‌గా అనిపించింది. ఇందుకోసం కాదుగా ఇంతదూరం వచ్చింది. తెల్లగా, బక్కగా ఉన్న ఒక అరవయ్యేళ్లు దాటిన మగాయన పెరట్లోకి వచ్చి "లక్ష్మీ! గుడ్‌మాణింగ్" అంటున్నాడు. ఈయనేనా శంకర్ అంటే. శంకర్‌కాదు శంకరంగారు అయుండొచ్చు.

విహాయసన మేడమ్ చేతులు కడుక్కుని లోపలికి వెళ్లి కాఫీ కలిపి పట్టుకొచ్చి ఇచ్చారు. ఈలోపల నా పరిచయం అయింది. శంకరంగారు పెరటి వరండాలో కుర్చీలో చేరబడి పేపరు తెచ్చి పెట్టవోయ్ అంటే ఆమె వెళ్లి 'హిందూ' తెచ్చి ఇచ్చారు. సార్‌గారు పేపరు చూస్తూ కాఫీ తాగడం మొదలుపెట్టారు.

కలా? నిజమా! నమ్మలేకపోయాను. నా కళ్లముందు జరుగుతున్నది నిజమేనా? ఇక్కడా ఈ ఇంట్లో కూడా అందరిళ్లలాగానే ఇంత రొటీన్‌గా... పతిసేవా... చెత్తా... చెదారం....

మేడమ్ కనిపెట్టేసింది. నా మొహంలో చిరాకో, అసహనమో ఏదోగానీ, దాన్ని ఆమె దొరకబుచ్చుకుంది. కానీ ఏమీ మాట్లాడలేదు. తెలివయిన చిరునవ్వు నవ్వింది.

పద. మన రూంలో కూర్చుని కబుర్లు చెప్పుకుందాం అంటూ ఆవిడ తన గదిలోకి దారితీసారు. గదికి లేతాకుపచ్చటి పొడుగు గీతల తెర. లోపల కిటికీలకు కూడా అవే తెరలు. బయటి ఎండ పొడపడి తెరల ఆకుపచ్చరంగు గదిలో ప్రతిఫలిస్తోంది. ఒక మూల కుండీలో పేరు తెలియని ఆకుపచ్చటి ఆకుల మొక్క బలంగా.

ఎదురుగా గోడ మీద ఒక చిత్రమయిన పెయింటింగ్. ఓరగా తెరిచి ఉన్న తలుపులోంచి దొర్లుతూ బయటికొచ్చిన ఊలుదారపు బంతి. చాలాదారం లోపల ఉండిపోయింది. సగం బంతి ఇవతలకి జారి, ఇంకా దొర్లబోతూ, తేలికయి పోబోతూ, తగ్గిపోతూ ఉన్నట్టు భ్రాంతిని కలిగించే బొమ్మ అది. ఊదారంగు ఊలుదారపు బంతి తలుపు వెనకా, ముందూ కూడా నల్లదనం, చీకటిలా. ఆ బొమ్మని చూస్తున్న కొద్దీ థాట్ ప్రాసెస్‌ని కొంచెం కొంచెంగా కదిలిస్తూన్నట్టూ, లేపుతున్నట్టూ అనిపిస్తోంది. ముఖ్యంగా రంగులు, బంతి కదులుతున్నట్టనిపించే నీడలు...

ఆ బొమ్మ చూస్తూ ఉండిపోయిన నన్ను గమనించి "అక్కడే ఆగిపోతే ఎలా? ఇంకా చూడాల్సినవి చాలా ఉన్నాయి" అంటూ తోటలోంచి వచ్చేటప్పుడు తనతో తెచ్చిన పసుపుగన్నేరు పూల కొమ్మ, గులాబీరంగులో ఉన్న గులాబీ పువ్వూ గాజు వాజ్‌లో అమర్చుతున్నారు. పాత పూలు కాస్త వాడి ఉన్నాయి. అవి తీసి పక్కనున్న డస్ట్‌బిన్‌లో వేస్తూ, టేబుల్ మీద చిందిన రెండు నీటి చుక్కల్ని తన చీర కొంగుతో అద్దితుడిచారు.


ప్రతి చిన్న పనీ ఈమె ఎంతో శ్రద్ధగా చేస్తారన్నమాట. కానీ ఇలా ఈ ఇంటి అలంకారాలు చేసుకునే ఈమెకు టైం ఎక్కడ మిగుల్తుంది? అనుకున్నాను నేను.


నాక్కూడా చిన్నచిన్న పనులు చెప్తూ వంటంతా ఆమె చేసారు. తోటకూర, పెసరపప్పు కలిపిన కూరలో మినపవడియాలు ఘుమఘుమలాడే పోపు. ఉల్లిపాయ పులుసు పెట్టి గుమ్మడి వడియాలు, చల్లమిరపకాయలు వేయించారు. ప్రతి వంటకమూ ఆమె తయారుచేసే విధానాన్ని నేను గమనిస్తూనే ఉన్నాను. చాలా ఆసక్తికరంగా అనిపించింది. మాంఛి ఇంగువ సువాసనలీనే మాగాయి ఊరగాయి సీసాలోంచి తీసి చిన్న బౌల్‌లో పెడ్తుంటే... నిజం చెప్పొద్దూ... నాకు నోట్లో నీళ్లూరేయి.

వంటకి, రుచులకి ప్రాధాన్యత నివ్వవద్దని అవి మానసిక వికాసానికి, అభివృద్ధికి అడ్డుపడే ప్రథమ ప్రతిబంధకాలని చెప్పే ఈ స్త్రీవాద రచయిత్రి ఇంట్లో ఏమిటి? ఇలా ఉంది? అంతా తలకిందులుగా.

అన్నింటినీ టేబుల్ మీద ఎంతో నేర్పుగా అమర్చి శంకరం గారిని పిలిచారు. ముగ్గురం భోజనం చేసాం. సాధారణమయిన వంటకాలతో విందుభోజనంలా చేయించిందామె. ఇందులో ఉన్న కిటుకు ఏమిటో అంతుబట్టలేదు.

నాలాగే మేడమ్ కూడా త్వరగా తినేసారు. అప్పటికి శంకరంగారు కూర కలుపుతూ,





చల్లమిరపకాయలు  కొరుకుతున్నాడు. నేను  కూచునే ఉన్నాను. టేబుల్ మేనర్స్ గుర్తుచేసుకుంటూ. 'విహాయస' లేచి చెయ్యి కడుక్కుని ఇద్దరి కంచాలూ తనే తీసి సింక్‌లో వేసేసారు. "లే... మనం ఇతనితో కూచుంటే అవదు. నీకు చాలా చూపించాలి. చెయ్యి కడుక్కునిరా" అంటూ ఆమె రూంలోకి వెళ్లిపోయారు.

నేను చెయ్యి కడుక్కుని, నేప్‌కిన్‌తో తుడుచుకుంటూ హాల్‌కి రెండోవేపున ఉన్న ఆమె వెళ్లిన రూంలోకి అడుగు పెట్టాను. ఇది ఆమె రీడింగ్ రూం అనుకుంటా. రెండు వేపుల ఉన్న  గోడలకి  గోడలంత ఎత్తుగా గోడలలోకి అల్మారాలు. వాటి నిండా తెలుగు ఇంగ్లీషు పుస్తకాలు. ఒకవైపు కంప్యూటర్, ప్రింటర్‌తో సహా. కిటికీ దగ్గరగా సింగిల్‌కాట్. మంచంనిండా చెదురుమదురుగా పుస్తకాలు, తెరిచిపెట్టీ, బుక్‌మార్క్‌తో మూసి ఉంచీ, రకరకాలుగా. ఒకవైపు పాడుతూ ఆగినట్టున్న వాక్‌మన్.

గది ఆమె అంతరంగంలా ఉంది.

రెండు గంటలసేపు ఆమె తనతో నన్ను ఆ గదిలోనే కూర్చోపెట్టారు. మొదటి లేడీ పైలట్, పైలట్ ఆఫీసర్ల దగ్గర్నుంచి వరుసగా అందరి వివరాలు ఉన్న వెబ్‌సైట్స్ చూపించారు. వివిధ దేశాల వాళ్లే కాక భారతదేశ స్త్రీలవి కూడా. ఇన్ని విషయాలతో, ముఖ్యంగా నాకు అవసరమయినవి వెబ్‌సైట్స్‌లో ఉన్నాయనే తెలీదు నాకు. ఈవిడకెలా తెలుసు. ఆ మాటే అడిగాను.

"నువు ట్రైనింగ్‌లో చేరగానే నీకు సంబంధించిన సమాచారమంతా పోగుచేసుకుంటూ వచ్చాను. నాక్కూడా ఆ కొత్త విజ్ఞానమంతా తెలుస్తుందిగా నీ మూలాన. దాని మీద నేనూ ఒక ఆర్టికల్ రాసుకోవచ్చు" అన్నారు.

ఇదీ చదువంటే. అరవయి ఏళ్ల  వయసులో కూడా ఈవిడ చదువుకుంటోంది.

మధ్యలో డైనింగ్ రూంలోకి వచ్చాను- మంచినీళ్లు తాగుదామని. శంకరంగారి భోజనం అయిపోయినట్టుంది. హాల్లో కూచుని టి.వి.లో వస్తున్న 'ఏనిమల్ ప్లానెట్'లో సముద్రపు జంతువుల కదలికలు చూడడంలో మునిగిపోయారు.  అప్పుడు గుర్తొచ్చింది- గిన్నెలన్నీ తీసి టేబుల్ ఎవరు శుభ్రం  చేసారా? అని. కుతూహలం కొద్దీ వంటింట్లోకి వెళ్లి చూసా.  అన్నీ చక్కగా సర్ది మూతలు పెట్టి ఉన్నాయి. వాడిన గిన్నెలు, కంచాలు సింక్ కింద ఉన్న ప్లాస్టిక్ టబ్‌లో పొందికగా పడేసి ఉన్నాయి. సింక్ శుభ్రంగా ఉంది. ఇదంతా ఈయన పనేనా?

మంచినీళ్లు తాగి తిరిగి రీడింగ్ రూంలోకి వెళ్లేసరికి ఆమె ఏదో ఒక ఇంగ్లీషు ఆర్టికల్ ప్రింటవుట్ తీస్తున్నారు.

"టేబుల్ ఎవరు క్లీన్ చేసారు" అని నా కుతూహలం అడిగించింది.

"ఎవరేముంది? శంకర్ చేసేస్తాడు."

మరి ఈమె ఉదయం కాఫీ ఎందుకందించింది? ఈయన తెచ్చుకుని తాగలేరా? నా సందేహం.

"చూడు వినీలా! నీ సందేహాలు నాకు అర్థమవుతున్నాయిగానీ మరీ మొట్టమొదటి మెట్టుమీంచే చూస్తున్నావు నన్ను. సాయంత్రం నీ సందేహాలు తీరుస్తాగానీ ఈ వ్యాసం చూడు. ఇది నీకోసమే తీసాను" అంటూ నాలుగు పేజీల ఆ వ్యాసం పిన్ చేసి నాకు అందించారు.

నేను ఆ వ్యాసం చదువుతూ ఉండేసరికి ఆమె ఒక  ప్లేట్‌లో కోసిన జామకాయ ముక్కలు తెచ్చి నా పక్కన పెట్టి "ఇవి తింటూ ఈ గదిని కూడా కొంచెం కొంచెం  తిను. నేను ఒక గంట నిద్రతీసి వస్తాను" అని వెళ్లిపోయారు.

అలమార్ల నిండా రకరకాల పుస్తకాలు. ఇవికాక ప్రపంచంలోని ఎన్నో పెద్ద గ్రంథాలయాల్లోని పుస్తకాలలోంచి వెబ్‌సైట్ల లోంచి ఏరి మెమరీల్లో దాచుకున్న ఎంతో విజ్ఞానం ఈవిడకి టైం ఎక్కడ సరిపోతోందో అనుకుంటూ ఆ ఆర్టికల్ ఒక పేజీ తిప్పేసరికి నాకూ ఆవలింతలు మొదలయ్యాయి. రాత్రి నిద్రలేదేమో? ఈ పూట మాంఛి భోజనం. ఆపైన పళ్ల ముక్కలు. నిద్ర ముందుకొస్తోంది.

** ** **

రాత్రి పది దాటింది. సాయంత్రం మేమిద్దరం వాకింగ్‌కి వెళ్లొచ్చేసరికి శంకరంగారు కూర  వండి కేరట్లు,  కీరాలు కోసి రెడీ చేసారు. మేడమ్ పుల్కాలు కాల్చారు. నేను ఒత్తబోయాను. సరిగా రాలేదు. నాకు వంట అస్సలు అలవాటులేదు. వంట పని చాకిరీ అని భావించి అసలు నేర్చుకోలేదు. ఆమె నా చేతిలోంచి ఛాక్కుని తాను ఒత్తలేదు.

"ఎలా వచ్చినా సరే నువ్వే చెయ్యి. పని వచ్చి ఉండాలి. నీకు కుదరకపోతే మానెయ్యవచ్చు. అది వేరే విషయం"

అలా వచ్చీరాకుండానే నేను పుల్కాలు ఒత్తి ఇస్తే ఆమె కాలుస్తూండగా అవే తింటుంటే అనిపించింది- ఇంటికి వెళ్లాక ఈ పని స్వంతంగా నేనే చెయ్యాలి అని.

సార్  చేసిన కూర  పెద్ద రుచిగా లేదు. మేడమ్ అయితే ఈ కూర చాలా రుచిగా చేసి ఉందురనిపించింది ఉదయం తిన్న రుచులను బట్టి. కానీ  ఆమె రుచి కోసం ఆ  బాధ్యత తనమీద వేసుకోకపోవడం తెలుస్తోంది నాకు.

ఈమె  తను  పనిచేస్తూనే ఎదుటి మనిషి ఎవరు కానీ పనిచేయించగలదు. దీన్ని నాయకత్వ లక్షణమంటారా? ఒకరికి చెయ్యగలదు. ఒకరిచేత చేయించుకోగలదు. దీన్ని నేర్పు అంటారా?

ఏమోగాని చాలా ఆసక్తిదాయకంగా ఉంది.

పది దాటేసరికి రాత్రి యౌవనంలోకి ప్రవేశించిందనిపిస్తుంది.  చలి కాస్త పెరిగింది. ఈ గది కిటికీలోంచి చూస్తుంటే విచ్చటానికి సిద్ధమయిన పారిజాతాల పలకరింపు. ఇంతలో  వీధివేపు  దీపం తీసేసినట్టున్నారు. బయటంతా ఒక్కమాటుగా వచ్చి వాలిన వెన్నెల. వెన్నెల ఇంత బావుంటుందా? లేక ఈ 'చైత్రరథ'లో కాసే వెన్నెలకే ఈ మెత్తని చల్లని అలరింపు ఉందా?

చెవులని మృదువుగా 'లకీ ఆలీ' స్వరం సోకింది. ఇక్కడి వెన్నెల లకీ ఆలీ పాటలు కూడా పాడగలదా?

నేలమీద ఉండగానే ఆకాశంలో విహరింపచేసేలా చెయ్యగల ఆ నేర్పు ఇంకెవరిది?

ఆమె లోపలికి వచ్చి సిస్టమ్‌లో లోడ్ చేసి ఉంచిన పాటని నాకోసం వెన్నె లలోంచి అందించారన్నమాట. ఆ పాట పూర్తి అయిన తర్వాత చెప్పారు.

"నీకు తెలుసా! ఈ పాట మా మనవడు పరిచయం చేసాడు నాకు. వాడికి ఈ గాయకుడంటే ఎంతో ఇష్టం."

"మీ మనవడు ఎంత ఉంటాడు?"

వాడికి పదమూడేళ్లు. మాంఛి సంగీత ప్రియుడు. మా అమ్మాయి ఫ్రెండ్ 'నబీ'కి సంగీతం ఇష్టం. ఆ ఇష్టమే వీడికీ వచ్చింది.

'నబీ ఎవరు?" అడగవచ్చో, అడగకూడదో అనుకుంటూనే-

నీకు చెప్పలేదు కదా! నబీ మా అమ్మాయి క్లాస్‌మేట్. డిగ్రీ నుంచి పి. జి. దాకా. ఎం.బి.ఎ., అయిన తర్వాత నుంచి వాళ్లు ఇద్దరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. పెళ్లి మీద వాళ్లకి నమ్మకం లేదు. ఒకరికి ఒకరు బరువనిగాని రొటీన్ అనిగానీ అనిపిస్తే విడిపోవాలని ఒప్పందం. పదిహేనేళ్లయింది. ఇంకా అనిపించినట్టులేదు. వాళ్ల పిల్లాడే 'లకీ ఆలీ' ఫ్యాన్.

"మోసగించడం అంటే ఏమిటి?"-
"నిజమే. పెళ్లి చేసుకుంటానని మానేస్తే మోసం. పిల్లాడిని కని వదిలేస్తే మోసం. మరెవరి మీదో ఇష్టం కలిగి దాస్తే మోసం. ఇష్టం లేకపోతే వదిలెయ్యవచ్చనేగా ఒప్పందం.'
"అవును. ఆడవాళ్లు ఎందుకు మోసపోతారు? మరి!"
"ఎందుకో చెప్పనా? ఆడవాళ్లు అన్నిటికీ మగవాళ్ల మీద ఆధారపడిపోతారు గనక. అన్నిటికీ అంటే డబ్బుసరే, సాంఘిక భద్రత నుంచి, ఉద్యోగాల ఉపశమనం దాకా"

అవలీలగా ఆమె చెప్తున్న మాటలు నాకు గాభరా పుట్టించాయి. "ఒకవేళ నబీ మీ అమ్మాయిని మోసగిస్తే" అన్నాను.

"మోసగించడం అంటే ఏమిటి?"

"నిజమే. పెళ్లి చేసుకుంటానని మానేస్తే మోసం. పిల్లాడిని కని వదిలేస్తే మోసం. మరెవరి మీదో ఇష్టం కలిగి దాస్తే మోసం. ఇష్టం లేకపోతే వదిలెయ్యవచ్చనేగా ఒప్పందం.'

"అవును. ఆడవాళ్లు ఎందుకు మోసపోతారు? మరి!"

"ఎందుకో చెప్పనా? ఆడవాళ్లు అన్నిటికీ మగవాళ్ల మీద ఆధారపడిపోతారు గనక. అన్నిటికీ అంటే డబ్బుసరే, సాంఘిక భద్రత నుంచి, ఉద్యోగాల ఉపశమనం దాకా"

"ఒక మనిషి మీద ఆధారపడకుండా సంఘ నిర్మాణం ఉందా? మానవ జీవితం నడుస్తుందా?"

నడవదు. నిజమే. నువ్వు అతని మీద ఎంతగా ఆధారపడుతున్నావో, అదే స్థాయిలో అతను కూడా నీమీద ఆధారపడేలా నువు తయారుకాగలవా? దాన్ని అతను గ్రహించుకునేలాగ చెయ్యగలవా?"

లకీ ఆలీ స్వరం తాలూకు మత్తు దిగిపోయింది.

"ఆడవాళ్ల మీద ఇంత బాధ్యత ఎందుకు పెట్టాలి" నా ప్రశ్న.

"స్వాతంత్ర్య పోరాటం అంత సులువయినదేమీ కాదు. 'స్వతంత్ర దేవత కలకత్తా కాళిక నాలుకలాంటిది. దానికి నిరంతర అశ్రునైవేద్యం సమర్పించాలంటాడు' చలం. నువ్వే ఉన్నావు. ఈ స్థాయికి రావడానికి ఎంత కష్టపడ్డావు?"

నిజమే. ఈవిడకి అర్థమయింది. చాలా కష్టపడ్డాను. చాలాచాలా ఒక కింది మధ్యతరగతి ఇంటి ఆడపిల్లని. ఆకాశంలో తిరగడానికి. ఎంసెట్ టెన్షన్లు అక్కర్లేకపోయినా ఏరోనాటిక్ ఇంజనీరింగ్ చదువు రోజుల ఇబ్బందులు. ఇబ్బందులన్నమాట చాలా చిన్నమాట. ఒక సిటీ పత్రిక ఇంటర్వ్యూ తీసుకున్నప్పుడు ఆ పత్రికలో వేసిన నా రంగుల ఫోటో చూసినప్పుడు ఈ కష్టాలన్నీ ఇబ్బందుల్లాగ మారిపోలేదా? నాకు దొరికిన ఉద్యోగం కంటే ఈ పైలట్ పాత్ర చిన్నదయినా సరే ఛాలెంజ్‌గా ఎంచుకో దానికి కూడా ఎంత సాహసం అవసరమయింది?

"సరేనోయ్! ఇంక ఈ రోజుకి మన చర్చలు చాలు. రేపు ఉదయం పచ్చిమిర్చి, అల్లంతో ఉప్మా, పెసరట్టు టిఫిను. నువ్వే చేస్తున్నావు." నా గుండె ఆగినంత పని అయింది. ఆకాశంలో విమానం నడపగలను గానీ ఉప్మా పెసరట్ చెయ్యడం రాదే!

ఆ మర్నాడు సాయంత్రం అడిగాను ఆమెను.

గత పదేళ్లుగా మీరు ఏమీ రాయలేదు. ఎక్కడా ఏ సభలోనూ కనిపించడంలేదు. ఇలా వంటింటికి, ఇంటికి, ఇంటి వెనక పూలమొక్కలకి మీ తెలివిని, జ్ఞానాన్ని అప్పగించి ఉండిపోతారనుకోలేదు. మీరు ఇంతకాలం చెప్పిందేమిటి? అది చదివిన నేను, ఆ కొత్తదారి చూపిన ఆలోచనలతో ప్రభావితమయిన నేను, మీరు ఇక్కడ... ఇలా... ఉంటారని ఊహించలేదు.

ఆమె మొహంలో ఆశ్చర్యం.

ఆడవాళ్లు వంటిళ్లు వదిలి బయటికి రాకపోతే జీవితం లేదన్న మీరే ఇలా ఇంటికి బందీ అయిపోయారంటే నాకు దిగులుగా ఉంది."

ఈసారి ఆవిడ మొహంలో ఆశ్చర్యం స్థానంలో పరిహాసం చేరింది. పెదవుల మీదకు నవ్వు దానంతట అదే వచ్చింది.

"ఊ... వంటింటి కుందేలునయేనంటావ్. తిరిగి వెనక్కి వచ్చేనంటావ్..."

అలా అన్నాను కానీ ఆమెను ఈ రెండు రోజులుగా చూస్తుంటే అదీ పూర్తిగా నిజం కాదని అనిపిస్తోంది. ఏదో ఒక అస్పష్టత. ఈమె ఎందుకో సరిగా అర్థంకావట్లేదు.

"రేపు ఉదయమే వెళ్లిపోతున్నాను. మళ్లీ ఎప్పటికి వస్తానో తెలీదు. మీ రచనలు చదివి నేను ఇలా బయట ప్రపంచాన్ని గెలిచాను. తీరా ఇక్కడికి వచ్చి చూస్తే మీరూ మా అమ్మమ్మ లాగ వడియాలు పెడ్తూ, పెసరట్లు వేస్తూ ఇల్లు సర్దుతూ, సాధారణ గృహిణయిపోయారు. అందుకే అర్థంకావట్లేదు" అన్నాను.

మీ అమ్మమ్మ జీవితమంతా వంటింట్లోనే గడిపారు. నేను చాలా చిన్నప్పుడే వంటిళ్ల 'డ్రెడ్జరీ'ని, ఇళ్ల పెత్తనాన్ని గ్రహించాను. అందుకే వాటిని ఎదిరిస్తూ బయటికొచ్చాను. బయటి ప్రపంచాన్ని నువు చెప్పినట్టు అర్థం చేసుకోవడమో, గెలవడమో అది చేసాను. ఆ తర్వాతనే ఇంటిని కూడా గెలవొచ్చని తెలిసింది"

తెలిసింది."

"మరి బయటికి రావడం ఎందుకు మానేసారు?"

బయటికి రావడం అంటే ఏమిటి? బయటి ప్రపంచపు రిమోట్ నా చేతిలో ఉందని ప్రింట్ అవుట్ తీసి నీకిచ్చిన ఆర్టికల్ చెప్పడంలేదూ? ఈ ఉదయం పల్లెకి మనం వెళ్లింది సైట్ సీయింగ్‌కి అనుకున్నావా? 'లూసీ ఇరిగరే' అన్న స్త్రీవాద తత్వవేత్త భావాల మీద సర్వే అని నీకు కొద్దిరోజుల్లో తెలుస్తుందని నేను ఇప్పుడే ఎందుకు చెప్పాలీ?

అవునా! ఈ ఉదయం ఆ పొలాల గట్ల మీద ఆడవాళ్లతో ఆమె మాట్లాడుతుంటే నేను గింతకాయల్ని గురిచూసి కొడుతూ కాలక్షేపం చేసాను.

"మరి సభలూ, సమావేశాలూ ఎందుకు మానేశారు"

"అదే నీ కంప్లయింట్. నా ఫోటో నీకు పేపర్లలో కనిపించడంలేదని. అది నీ ఫాన్సీ ఆలోచనకదూ!" అని నవ్వేసారు.

"నాకు అర్థమయినదేమిటంటే బయటికి వచ్చేకొద్దీ మనకి వచ్చే పాపులారిటీ, పేరూ మనల్ని 'క్యాప్చర్' చేస్తాయి. మనం ఎందుకొచ్చేమో మర్చిపోతాం. ఎంతోమంది మగవాళ్ల విషయంలో జరిగేది అదే. నాకు ఆ సంగతి బాగా అనుభవమయింది. ఇంకా ఆ రోజుల్లోలాగే ఉంటే ఇలా నాకోసం వచ్చే నీవంటి దానితో పావుగంట కూడా మాట్లాడే వీలు ఉండకపోను.

ఒక కెరీరిస్టుగా కాకుండా ఉండడంకోసం, ఒక మానవిగా మిగలడం కోసం నా స్వేచ్ఛని ఉపయోగించుకున్నానని, అదే నన్ను ఇలాంటి జీవన విధానంలోకి తెచ్చిందని చెప్తే నీకు సులువుగా అర్థమవుతుందా?" అని ఆగారు.

మా అమ్మమ్మ నుంచి ఈమె దాకా చాలా పెద్ద ప్రయాణం. మా అమ్మమ్మ కూడా మానవే కానీ వెన్నెముక లేని మానవి.

ఆమె లేచి వెళ్లి నిన్నటిలాగే అగరవత్తులు వెలిగించి తెచ్చి గదిలో ఓ మూల ఉంచారు. స్పర్శచంప అగరవత్తులట అవి. ఈ రెండు రోజులుగా గదంతా ఒకటే సంపంగి పూల సువాసన. ఈ సువాసన ఏమిటో ఆమె చెప్తేనేగాని తెలీలేదు. అదీ రెండు రాత్రులు గడిచిన తర్వాత.

నా ప్రయాణం నేనూ మొదలుపెట్టాలి. రేపటి ఉదయపు నా ప్రయాణానికి ఈ రాత్రంతా గడవాలి. బేగ్ సర్దుకోవడం మొదలుపెట్టాను. ●